AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 220 గ్రాముల అల్ప్రాజోలం పట్టివేత

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎక్సైజ్ అధికారుల దాడుల్లో 220 గ్రాముల అల్ప్రాజోలం దొరికింది. ఈ మేరకు బుధవారం అధికారులు వివరాలు వెల్లడించారు. సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామ శివారులో గడిపల్లి శ్రీకాంత్ గౌడ్ వద్ద నాలుగు గ్రాముల అల్ప్రాజోలం దొరికిందన్నారు. అతడిని విచారించి.. నాగిరెడ్డిపేట మండలం బొల్లారం గ్రామానికి చెందిన ఇగురం రాజేందర్ గౌడ్ వద్ద 110 గ్రాములు, జలాల్‌పూర్‌కు చెందిన మాణిక్య గౌడ్ వద్ద 106 గ్రాముల అల్ప్రాజోలం సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ, టాస్క్ ఫోర్స్ సీఐ సుందర్ సింగ్, ఎక్సైజ్ ఎస్సైలు విక్రమ్, శరత్ కుమార్, సిబ్బంది సిద్ధిరాములు, మారుతి, అభిషేక్, అమోస్, శ్రీకాంత్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీరాగ, రమ, అపూర్వ పాల్గొన్నారు.



## బీజేపీ హామీలను నెరవేర్చాలి: డీసీసీ అధ్యక్షుడు నగేశ్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కేంద్రంలో బీజేపీ ఇచ్చిన హామీలను ముందు నెరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు నగేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు ఈ నెల 21న కలెక్టరేట్ ముట్టడిస్తామని ప్రకటించారన్నారు. ముందు బీజేపీ ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. బీజేపీ హామీలు నెరవేర్చలేదని ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నారా.. లేదా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నందుకు ముట్టడి చేస్తున్నారా నిలదీశారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజ నరేందర్ గౌడ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగం, కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రజొన్న రైతును ముంచుతున్న సిండికేట్లు : వేముల ప్రశాంత్ రెడ్డి



**అక్షరటుడే, భీమ్‌గల్:** రాష్ట్రంలో ఎర్రజొన్న, మొక్కజొన్న రైతులు పడుతున్న ఇబ్బందులపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం శాసనసభలో ధ్వజమెత్తారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో పండే ఎర్రజొన్న (ఫోడర్ జవార్) కొనుగోళ్లలో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది క్వింటాలుకు రూ.3,800 పలికిన ఎర్రజొన్న ధరను, ఈసారి సాగు విస్తీర్ణం తగ్గినా వ్యాపారులు కుమ్మక్కై రూ. 3వేలకు తగ్గించారని విమర్శించారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ. 10వేల చొప్పున నష్టం వాటిల్లుతోందని, కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని మద్దతు ధర లభించేలా చూడాలని డిమాండ్ చేశారు.




# పైసా వసూల్

■ అక్రమ నిర్మాణాలే లక్ష్యం ■ డబ్బులిస్తే ఒకే.. లేకుంటే నోటీసులు ■ వసూళ్ల కోసం కమిటీ ఏర్పాటు! ■ కామారెడ్డి బల్దియాలో భారీగా అవినీతి

**కామారెడ్డి మున్సిపాలిటీలో భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు అధికారులు భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అక్రమ నిర్మాణాలను లక్ష్యంగా చేసుకొని వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇటీవల ఏసీబీ అధికారుల దాడులతో బల్దియాలో జరిగిన అవకతవకలు, అవినీతి కార్యకలాపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. నాయకుల పేర్లు చెప్పి పలువురు అధికారులు, కిందిస్థాయి సిబ్బంది భారీగానే దండుకున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఒక టీం ఏర్పాటు చేసినట్టుగా ప్రచారం సాగుతోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులు ఉన్నాయి. ఇందులో వాణిజ్య ప్రాంతాలు గల వార్డుల్లో ఆదాయానికి ఢోకా ఉండదు. అలాంటి కమర్షియల్ వార్డుల్లో ఇంటి నిర్మాణం జరిగితే స్థానికంగా ఉన్న నాయకులు, అధికారులకు పండగే. బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతుండగా కొంతమంది మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే కొన్ని అంతస్తులు నిర్మించినట్టుగా ఆరోపణలున్నాయి. ఇలాంటి నిర్మాణాలు చేపడుతున్న వారిని తమ దారికి తెచ్చుకునేందుకు అధికారులు నోటీసులను అస్త్రంగా ఉపయోగిస్తున్నట్లు సమాచారం. అక్రమ నిర్మాణాలపై ఫోకస్ చేసి వాటి లిస్ట్ తయారు చేసుకుని దర్జాగా వసూళ్లకు పాల్పడినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### డబ్బులిస్తే ఒకే..

కామారెడ్డి పట్టణంలో గడిచిన పదేళ్లలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగాయి. అనుమతులు లేకుండానే పెంట్ హౌస్‌లు, అదనపు ఫ్లోర్లు నిర్మించారు. అవినీతి అధికారులు ఇలాంటి భవనాల వివరాలు తీసుకుని వాటిని కూల్చేందుకు నోటీసులు జారీ చేసినట్టుగా సమాచారం. నోటీసులకు స్పందించిన కొందరు మధ్యవర్తుల ద్వారా అధికారులను సంప్రదించి భారీగా ముడుపులు ముట్టజెప్పినట్టుగా తెలుస్తోంది. ఆ తర్వాత వాటికి మళ్లీ అనుమతులు జారీ చేసినట్టుగా ప్రచారం సాగుతోంది.

### ఫైవ్ మెన్ కమిటీ వసూళ్లు

మున్సిపాలిటీలో వసూళ్ల కోసం ప్రత్యేకంగా ఫైవ్ మెన్ కమిటీ ఏర్పాటు చేసినట్టుగా గతంలో ప్రచారం సాగింది. ఇంటి నిర్మాణాలు, కబ్జాలు, సెటిల్‌మెంట్లే లక్ష్యంగా ఈ కమిటీ పని చేసినట్టుగా తెలుస్తోంది. కమిటీలో ఒక్కొక్కరికి ఒక్కో బాధ్యత అప్పగించారని సమాచారం. చివరికి సెటిల్మెంట్ చేసి భారీగా డబ్బులు వసూలు చేసినట్టుగా ప్రచారం సాగింది.

### బయటకు పంపిస్తారా..

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ దాడుల తర్వాత అనేక అవినీతి కార్యకలాపాలు బయటకు వస్తున్నాయి. కార్యాలయంలో అధికారులు, నాయకులు నీకింత, నాకింత అన్నట్టుగా పంపకాలు చేసుకున్నట్లు సమాచారం. ఏసీబీ దాడుల నేపథ్యంలో అవినీతి అధికారులను బయటకు పంపిస్తారా లేదా అన్న చర్చ సాగుతోంది.



## మాజీ కార్పొరేటర్ మృతి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ నగరానికి చెందిన బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి సురేష్ (42) మృతి చెందారు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు సమాచారం. కాగా.. పంచరెడ్డి సురేష్ భార్య అనిత 16వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలుపొందిన విషయం తెలిసిందే. సురేష్ మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

### ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి

బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ పంచ రెడ్డి సురేష్ అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా విచారం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే బుధవారం హుటాహుటిన ఇందూరుకు చేరుకొని, ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు.



## ఎర్రజొన్నలకు 500 బోనస్ ఇవ్వాలి : రాకేష్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఎర్ర జొన్నలకు రూ.500 బోనస్ అందజేయాలని.. ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో ఎర్రజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం జీరో అవర్‌లో మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గంలో చాలా సమస్యలు ఉన్నాయని ఇప్పటివరకు చాలాసార్లు అసెంబ్లీలో ప్రస్తావించానన్నారు. నియోజకవర్గంలోని అంకాపూర్, గోవింద్‌పేట్, డొంకేశ్వర్, నందిపేట్ గ్రామాల రోడ్లు గుంతలతో నిండిపోయాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో పనులు చేయడానికి బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలన్నారు.

## రెండో రోజు ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం రెండోరోజు హిందీ పరీక్షలు జరిగాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతే పరీక్షకు అనుమతించారు. జిల్లాలో మొత్తం 13,144 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 13,111 మంది హాజరవ్వగా 33 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా రెండోరోజు 99.75 శాతం హాజరు నమోదైంది. భిక్కనూరు మండలం జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ప్రశాంత వాతావరణం, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలి: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** కేసుల దర్యాప్తు, విచారణలో స్టేషన్ రైటర్లు నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్టేషన్ రైటర్లు, సీఐలు, డీఎస్పీ కార్యాలయాల రైటర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో స్టేషన్ రైటర్ల పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ తెలిపారు. రైటర్ల పనితీరులో నాణ్యత ఉన్నప్పుడే నేరస్తులకు శిక్షలు పడడంతో పాటు బాధితులకు త్వరితగతిన న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తు పటిష్టంగా ఉంటేనే నేరస్తులకు శిక్షలు పడతాయని, తద్వారా సమాజంలో పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సీసీటీఎన్ఎస్ లో కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్త అవసరమని, తప్పుడు వాంగ్మూలాలు కేసు దిశను ప్రభావితం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి కేసులో సాక్ష్యాధారాలు బలంగా ఉండేలా రైటర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి ఛార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి అంశాన్ని ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల రైటర్లు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి: సుదర్శన్ రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లాలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు అనువైన స్థలాల కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పిసుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడడం జరిగిందన్నారు. పరిశ్రమను జిల్లాకు మంజూరు చేసేందుకు సీఎం సంసిద్ధత తెలిపారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సాధ్యమైనంత త్వరగా అనువైన స్థలాన్ని ఖరారు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమ ఏర్పాటైతే పెద్ద సంఖ్యలో ఆదర్శ రైతులు ఈ పంట సాగును చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. దీనివల్ల రైతులకు గణనీయమైన లాభాలు సమకూరడమే కాకుండా, ఆయిల్ పామ్ ఇండస్ట్రీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. దేశ అవసరాలకు అనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణంలోపే ఈ పంట సాగు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల ఇతర దేశాల నుండి వంట నూనె నిల్వలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవాల్సి రావడం భారంగా పరిణమించిందని, స్థానికంగానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించడంతో పాటు ప్రజలకు కూడా మేలు చేసిన వారవుతారన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, రమణ్ రెడ్డి తదితరులున్నారు.

## వైద్యుడు కనిపించే దైవం: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** వైద్యుడు కనిపించే దైవమని, రోగి బాధలో ఉన్నప్పుడు అతనికి కనిపించే మొదటి ముఖం వైద్యుడిదేనని ప్రభుత్వ సలహదారు షబ్బీర్ అలీ అన్నారు. పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో మెడికల్ విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులను ఘనంగా సన్మానించి, వారికి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. నేడు వైద్య విద్యార్థుల జీవితంలో ఒక కీలక మైలురాయి అని, విద్యార్థులు సాధించిన విజయం వారి కుటుంబ సభ్యులు, గురువులు, కామారెడ్డి జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. వైద్యులు తమ వృత్తిలో సేవకు ప్రాధాన్యం ఇవ్వాలని, పేద ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్య శాస్త్రంలో మారుతున్న పరిజ్ఞానాన్ని అలవరచుకోవడం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వాల్య రాథోడ్, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఏఐసీసీ పరిశీలకుడిగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియామకం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఏఐసీసీ పరిశీలకుడిగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు నియమితుల య్యారు. ఈ మేరకు అధిష్టానం బుధవారం వివరాలు వెల్ల డించింది. 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్రలో డీసీసీ అధ్యక్షుల ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకుల నియామకాన్ని చేపట్టారు. దీంట్లో భాగంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావును ఏఐసీసీ పరిశీలకుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మాట్లాడుతూ.. అధిష్టానం తనపై ఎంతో నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టిందని.. వారి నమ్మకాన్ని వమ్ము కానీయకుండా విధులు నిర్వర్తిస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు లక్ష్మీకాంతారావు ధన్య వాదాలు తెలిపారు.

## హనుమాన్ స్వాములకు మైనారిటీల భిక్ష



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని మేడిపల్లి గ్రామంలో జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ స్వాములకు భిక్ష (అన్నదానం) ఏర్పాటు చేశారు. మాల ధరించిన మేడిపల్లి సీతాపల్లి, చెన్నాపూర్ సర్వాపూర్ ప్రాంతాల్లో ఆంజనేయ మాల ధరించిన స్వాములకు రామాలయ ఆలయంలో భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున హనుమాన్ స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. హిందూముస్లిం తేడా లేకుండా మనమందరం సోదర భావంతో కలిసికట్టుగా ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ భిక్ష పలువురికి ఆదర్శగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు మహిళలు, పాల్గొన్నారు.



## మార్కెట్లలో ఉగాది సందడి..

ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని మార్కెట్లు సందడిగా మారాయి. పండుగలో ముఖ్యమైన ఉగాది పచ్చడికి అవసరమయ్యే కొత్త బెల్లం, చింతపండు, ఇతర వస్తువులు, సామగ్రి కోసం కిరాణా షాపుల వద్ద వినియోగదారులు బారులు తీరారు. అంతేకాకుండా కొత్తకుండలో ఉగాది పచ్చడి తయారు చేయడం ఆనవాయితీ. నగరంలోని పలు చోట్ల పూలు, పండ్ల సముదాయాలు వెలిశాయి. పంచాంగం పుస్తకాలను కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపారు. గాంధీచౌక్, గంజ్, పెద్దబజార్, రాజరాజేంద్ర చౌరస్తా, వీక్లీ మార్కెట్, తదితర ప్రాంతాల్లో పండుగకు అవసరమయ్యే వ్యాపార సముదాయాలు వెలిశాయి. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్








## ముప్కాల్ కేజీబీవీలో '99 రోజుల వైద్య శిబిరం'

**అక్షరటుడే,ముప్కాల్:** ముప్కాల్ కేజీబీవీ పాఠశాలలో బుధవారం ఉదయం '99 రోజుల వైద్య ఆరోగ్య శిబిరం' నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి శంకర్ ఆధ్వర్యంలో మొత్తం 178 మంది బాలికల్లో కంటి, దంత ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 12 మందికి కంటి పరీక్షలు, 25 మందికి డెంటల్ స్క్రీనింగ్, 21 మందికి ఇతర చిన్నపిల్లల ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్ చేయగా మొత్తం 58 మంది విద్యార్థినుల్లో తాత్కాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు సతీష్, మద్దుల రాకేష్, కంటి వైద్య నిపుణులు గురురాజు, పాఠశాల ఎస్‌వో వినోద, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది మురళి, వనమాల, స్టాఫ్‌నర్స్ మమత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## బాల్కొండలో రంజాన్ తోఫా కిట్ల పంపిణీ

**అక్షరటుడే, బాల్కొండ:** పట్టణంలో రంజాన్ సందర్భంగా ముస్లింలు రంజాన్ తోఫాలను పట్టణ కాంగ్రెస్ నాయకులు బుధవారం అందించారు. పండుగ సందర్భంలో ప్రభుత్వ సాయం అందించడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాల్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ అధ్యక్షులు జావిద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, మర్కజ్ కమిటీ అధ్యక్షులు మజార్, నాయకులు షేరు, సయ్యద్ రియాజ్ అలీ, సయ్యద్ మజహరుద్దీన్, మహమ్మద్ యూనస్, ఖాజీ జైనుద్దీన్, సయ్యద్ షోయబ్, షేక్ వహాబ్, షేక్ షేరు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మురికి కాలువలో పడి ఒకరు మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** మురికి కాలువలో పడి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రి వెనుక భాగంలో ఉన్న మురికి కాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుని జేబులో రూ.4వేల నగదు ఉందని.. సంబంధిత వ్యక్తి వివరాలు తెలియలేదని ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టురట్టు



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** వరుస చోరీలకు పాల్పడుతున్న బైక్ దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ సాయి చైతన్య వివరాలు వెల్లడించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో జరిగిన వరుస బైక్ చోరీలకు సంబంధించి పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. అనంతరం సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మాబాద్‌లో నివాసం ఉంటున్న బాసర గ్రామానికి చెందిన షేక్ అర్బాజ్, దెగ్లూర్ నాఖాకు చెందిన పేరు షేక్ అరిబ్, ధర్మాబాద్‌కు చెందిన షేక్ అర్బాజ్ రెహమత్, ధర్మాబాద్ మండలం జరికోట్ గ్రామానికి చెందిన సోన్ కాంబ్లే, మనోజ్ శంకర్, నాయగావ్ తాలుకా టెంబర్నీ గ్రామానికి చెందిన చెందిన షేర్ అలీ, షాదుల్ షేక్‌లను అరెస్ట్ చేసినట్లు సీపీ వివరించారు. బాసర గ్రామానికి చెందిన అవేజ్, షేక్ ఇమ్రాన్ అలియాస్ అబూ అలియాస షేక్ సమీర్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో చోరీ చేసిన 17 మోటార్ సైకిళ్లను వారి వద్ద నుంచి పోలీసులు రికవరీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. చోరీ కేసులో అరెస్ట్ అయినవాళ్లలో కొందరిపై ఇప్పటికే పలు చోరీ కేసులు నమోదై ఉన్నాయన్నారు. రెండేళ్లుగా షేక్ అర్బాజ్ అలియాస్ మాయ, షేక్ ఇమ్రాన్ అలియాస్అబూ అలియాస్ షేక్ సమీర్, షేక్ ఆరిబ్, షేక్ రెహమాన్ అంతా కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడ్డారని తెలిపారు. 17 బైక్‌లను బాసరకు చెందిన ఆవేజ్, ధర్మాబాద్‌కు చెందిన షేక్ అర్బాజ్ రెహమత్, సోంకాంబ్లే మనోజ్, షేర్ షాదుల్ షేక్ తక్కువ ధరకే ఈ నిందితుల వద్ద బైక్‌లు కొనుగోలు చేసేవారని తెలిపారు. 17న సాయంత్రం అయ్యప్ప టెంపుల్ నవీపేట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా.. పోలీసులను చూసి పారిపోతుండగా నిందితులను పట్టుకున్నామన్నారు. రెండు జిల్లాలకు చెందిన 15 కేసులను చేధించినట్లు సీపీ తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన నిజామాబాద్ డివిజన్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఎస్సై మహేష్, నవీపేట్ ఎస్సై శ్రీకాంత్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ ఠాకూర్, రాజేందర్ సింగ్, సీసీఎస్ కానిస్టేబుల్స్ రవికృష్ణ, సర్దార్ నరేష్ యాదవ్, నరేష్ కుమార్, వసీం, రాజేంద్రప్రసాద్, క్రైం పార్టీ హెచ్‌సీ రాజేశ్వర్, రాజారెడ్డి, శ్రీకాంత్ గౌడ్, దత్తుగౌడ్, రాకేశ్, నాగరాజు, శంకర్, భాస్కర్ ఇతర సిబ్బందిని సీపీ అభినందించారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై ధర్నా చేస్తాం..:

### బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు



**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 20న జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు తెలిపారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని, రైతు వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మంట్ సకాలంలో మంజూరు చేయడం లేదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని, అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని వారికి ఇళ్లు ఇవ్వాలని, రైతు భరోసా సకాలంలో క్రమం తప్పకుండా చెల్లించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో గత సోమవారం అన్ని మండల కార్యాలయాలలో ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తామని, 23న రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి చేస్తామని తెలిపారు. రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఉద్యమం ఆగదని పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్, నాయకులు విపుల్, సంతోష్ రెడ్డి, నంది వేణు తదితరులు పాల్గొన్నారు.




## అకాల వర్షాలతో నేలకొరిగిన జొన్నపంట..

కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, పెద్దకొడప్‌గల్ మండలాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. భిక్కనూరు పంచాయతీ పరిధిలో విద్యుత్ స్థంభాలు దెబ్బతిన్నాయి. అలాగే కాస్లాబాద్, వడ్లం, బేగంపూర్ శివారులో జొన్నపంట పూర్తిగా నేలవాలింది. నాలుగు నెలల నుండి కంటికి రెప్పలా జొన్న పంటను కాపాడుకుంటూ వచ్చామని.. ఒక్క గాలివానకు పూర్తిగా నేల వాలిందని రైతులు ఆవేదన చెందారు. వారం పది రోజుల్లో కోతకు వచ్చే పంట నష్టపోయిందని వాపోయారు. అప్పులు తెచ్చి పంట సాగు చేశామని, ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని రైతులు కోరారు.
- అక్షటుడే, ఎల్లారెడ్డి/పెద్దకొడప్

## భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్సలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణ కేంద్రంలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించినట్లు ఐఆర్‌పీ వెంకటేష్ తెలిపారు. ప్రతి మంగళవారం, గురువారం ఫిజియోథెరపీ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, వివిధ గ్రామాల నుంచి వచ్చిన 8 మంది విద్యార్థులకు ఫిజియోథెరపిస్ట్ అరుణ్ ఆధ్వర్యంలో చికిత్సలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## రన్నింగ్ కారులో చెలరేగిన మంటలు..



**అక్షరటుడే, కామారెడ్డి:** రన్నింగ్ కారులో మంటలు వ్యాపించి కారు తగలబడిన ఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి - సిరిసిల్ల రోడ్డుపై రన్నింగ్‌లో ఉన్న సీఎన్‌జీ కారులోంచి పొగలు వ్యాపించి కారు దగ్ధమైంది. కారులోంచి ఒక్కసారిగా పొగలు రావడాన్ని గమనించిన శ్రీనివాస్ గౌడ్ కారును రోడ్డు పక్కకు నిలిపివేశాడు. వెంటనే అప్రమత్తమై ఫైర్, పోలీసు అధికారులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్, పోలీసు అధికారులు చేరుకొని మంటలను ఆర్పి వేశారు. కారులో షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దగ్ధమైన కారు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ గౌడ్‌కు చెందినదిగా అధికారులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.